# నినాదం
నిఖార్సైన జర్నలిజం

బుధవారం
31 జూలై 2024
తెలంగాణ ప్రాంతీయం


# రహదారులను ఆక్రమించే నిర్మాణాలను తొలగించండి

**- జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి**



**శేరిలింగంపల్లి,జులై 30 (నినాదం న్యూస్) :** జాతీయ రహదారితోపాటు అంతర్గత రహదారులపై ట్రాఫిక్ కు ఎటువంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రధాన రహదారులు అంతర్గత రహదారుల పైకి ఆక్రమించి చేపట్టే నిర్మాణాలను తక్షణమే కూల్చివేయాలని స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని చందానగర్ ,శేరిలింగంపల్లి సర్కిళ్లలో ..జోనల్ కమిషనర్ మంగళవారం ఉదయం ఆయన పలు విభాగాల అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా చందానగర్ సర్కిల్ పరిధిలో పిజెఆర్ ఎంక్లేవ్, అపర్ణ రోడ్లను పరిశీలించారు. అనంతరం లింగంపల్లి మార్కెట్ పరిసరాలను తనిఖీ చేశారు .అనంతరం బొటానికల్ గార్డెన్ వద్ద పర్యటించి పరిసరాలను పరిశీలించి పారిశుధ్య పనులను తనిఖీ చేశారు ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ కాలనీలలో అంతర్గత రహదారులను ఆక్రమించి చేపట్టే నిర్మాణాలను.... రహదారుల పైకి వచ్చిన ఫుట్ పాత్ లను తొలగించాలని ఆదేశించారు. రహదారులకు ఇరువైపులా పేరుకుపోతున్న చెత్త ...గ్రీన్ వేస్టేజ్ ని వెంటనే తొలగించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన డివైడర్ల ఏర్పాట్లను పరిశీలించాలని రహదారులపై ఏర్పడ్డ గుంతలను తక్షణమే పూడ్చివేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. రోజువారి పారిశుధ్య పనుల లో మరింత పురోగతి నెలకొనాలని జాతీయ రహదారులపై పారిశుద్ధ్య చర్యలను మరింత పెంచాలని జోనల్ కమిషనర్ సూచించారు. బొటానికల్ గార్డెన్ ఎదురుగా ఉన్న గుడిసెలను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు . నానాటికి పెరుగుతున్న ట్రాఫిక్ కు అనుగుణంగా ..రహదారులు ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. జోనల్ కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్ రెడ్డి, పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీలు మెహర, గణపతి ,వైద్యాధికారి డాక్టర్ కార్తీక్ , ఇంజనీరింగ్ డీ ఈ దుర్గాప్రసాద్ ,మహేష్ ,పారిశుధ్య విభాగం ఎస్ఆర్పీలు ఎస్ ఎఫ్ ఎల్ ఉన్నారు.

**విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి**

జోన్ పరిధిలోని వీధి దీపాల నిర్వహణపై జడ్సీ ఉపేందర్‌రెడ్డి తన కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధి దీపాల నిర్వహణపై పకడ్బందీ పర్యవేక్షణ చేపట్టాలని, పని చేయని వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రధాన రహదారులతో పాటు కాలనీ రహదారులపైనా ఎక్కడ వీధి దీపాలు పని చేయకపోయిన మార్చాలన్నారు. ఇప్పటికే జోన్ పరిధిలోని పలు ప్రాంతాలలో నెలకొన్న వీధీ దీపాలపై ఫిర్యాదులు అందుతున్నాయని, ఆగస్టు 3 లోగా అన్నింటినీ పరిష్కరించాలని జడ్సీ ఆదేశించారు. ప్రతి నిత్యం వచ్చే ఫిర్యాదులను ప్రాంతాల వారిగా విభజించి స్థానిక సిబ్బందికి అప్పగించి చర్యలు చేపట్టాలన్నారు. కార్యాలయంలో ట్విటర్ ద్వారా వచ్చే ఫిర్యాదులను ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దని జడ్సీ స్పష్టం చేసారు. ఈ సమావేశంలో ఎలక్ట్రికల్ విభాగం అధికారులు పాల్గొన్నారు.



# జోరుగా... అక్రమ నిర్మాణాలు

## పట్టించుకోని అల్వాల్ టౌన్ ప్లానింగ్ అధికారులు



**అల్వాల్, జూలై 30( నినాదం న్యూస్) :**

అల్వాల్ అక్రమ నిర్మాణదారులు నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా జరుగుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శలు వెళ్ళు ఎత్తుతున్నాయి. సెట్?బ్యాక్ ?లేకుండా ఇంటి నిర్మాణాలు, అనుమతి లేకుండా సెల్లార్ల ఏర్పాటు చేపడుతున్నారు. కళ్లెదుటే అక్రమ భవంతులు కనిపిస్తున్నా సబంధిత అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెద్ద పెద్ద బిల్డింగ్ లకు కేవలం నోటీసులు అందజేసి చేతులు దులుపుకుంటున్నారనే వాదనలు ఉన్నాయి. రాజకీయ పలుకుబడి, మామూళ్ల పర్వంతోనే ఆకాశన్నంటేలా నిర్మాణాలు వెలుస్తున్నాయి. పెద్దపెద్ద వాణిజ్య సముదాయాలకు కూడా సెల్లార్ పార్కింగ్ లేవు. ఆస్పత్రులు, షాపింగ్‌మాల్స్ ఎదుట రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నా కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు. ర్యాంపులతో రోడ్లను ఆక్రమిస్తున్నా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. భవన నిర్మాణదారులు నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. ఏటా వందల సంఖ్యలో ఇళ్లు నిర్మిస్తుండగా 70 శాతం వరకు నిబంధనలకు విరుద్ధంగానే సాగుతున్నాయి. సెట్‌బ్యాక్ మొదలుకొని సెల్లార్లు, అనుమతి లేని అంతస్తులు కళ్ల ఎదుటే నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. మున్సిపాలిటీ నుంచి తీసుకున్న అనుమతికి క్షేత్రస్థాయిలో చేపట్టిన నిర్మాణాలకు సంబంధం ఉండడం లేదు. సెల్లార్ నిర్మించి వ్యాపార అవసరాల కోసం అద్దె ఇచ్చుకుంటున్నారు. పెద్దపెద్ద వాణిజ్య సముదాయాలకు కూడా సెల్లార్ పార్కింగ్‌లు లేవు. ఆస్పత్రులు, షాపింగ్‌మాల్స్ ఎదుట రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. కార్పొరేషన్ అధికారులు సైతం అప్పుడప్పుడు హడావిడి చేస్తూ నోటీసులతో చేతులు దులుపుకుంటున్నారు.


**పెంట్‌హౌస్‌లపై చర్యల్లేవు..**

భవన నిర్మాణాల్లో నిబంధనలు తుంగలో తొక్కుతున్నారు.రెండు నుంచి నాలుగు అంతస్తుల వరకు ఉండే భవనాల్లో తప్పనిసరిగా పెంట్‌హౌస్ నిర్మిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పెంట్‌హౌస్‌లపై చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఇకనైనా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

# సైన్స్ ఫెస్టివల్‌కు చేవెళ్ల ఆదర్శ పాఠశాల విద్యార్థి

**చేవెళ్ల జూలై 30 (నినాదం న్యూస్):**

జపాన్‌లో జరగనున్న సైన్స్ ఫెస్టివల్ కు చేవెళ్ల ఆదర్శ పాఠశాల విద్యార్థి సరబ్ జిత్ అర్హత సాధించారని ప్రిన్సిపల్ టేనావతి పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన సైన్స్ ఇన్ స్పైర్ పరీక్షల్లో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన సరబ్ జిత్ జపాన్ లో త్వరలో జరగబోయే సైన్స్ ఫెస్ట్ కు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఆదర్శ ప్రిన్సిపాల్ టీనావతి మాట్లాడుతూ జపాన్లో జరగబోయే సైన్స్ ఫెస్టివల్ కు చేవెళ్ల ఆదర్శ పాఠశాల నుండి సారబ్ జిత్ ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మనిషి జీవితంలో ప్రతి మెట్టులోనూ సైన్స్ ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. సైన్స్ లేనిదే జీవితం లేదన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసే లక్ష్యంతో వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేస్తోందన్నారు. వీటి ద్వారా విద్యార్థుల్లో సైన్సుపై ఆసక్తి పెరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా సమాజానికి ఉపయోగపడే విధంగా విద్యార్థులను తీర్చిదిదుద్తారని అన్నారు. మండల జిల్లా స్థాయిలలో




ఎంపికైన విద్యార్థులను రాష్ట్రస్థాయి లో పాల్గొంటారని రాష్ట్రస్థాయిలో ఎంపికైన విద్యార్థులను జాతీయ అంతర్జాతీయ స్థాయికి ఎంపిక అవుతారని పేర్కొన్నారు.

# మైసమ్మ దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

**అల్వాల్, జూలై 30 (నినాదం న్యూస్)**

వెంకటాపురం డివిజన్లోని దినకర్ నగర్ లోని మైసమ్మ దేవాలయంలో బోనాల పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే మైనంపలి ్లహనుమంతరావు.ఆయనకుఆలయ నిర్వాహకులు లావణ్య కృష్ణ ఘనంగా సన్మాని ంచి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్ర మంలో లావణ్య కృష్ణ, టింకు, నిర్మల, సుకన్య, రమ, విమల, చిట్టిబాబు సూర్యకిరణ్ ,ఉదయ్, దేవేందర్ , సీఎం యాదగిరి, పాల్గొన్నారు.




# శేరిలింగంపల్లిలో ఘనంగా ఫలహారం బండి ఊరేగింపు

**- పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ**

**శేరిలింగంపల్లి,జులై 29 (నినాదం న్యూస్) :** ఆషాఢ బోనాల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా హఫీజ్ డివిజన్ పరిధిలోని ప్రకాశ్ నగర్ కాలనీలో బోనాల ఉత్సవాలలో భాగంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు పవన్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఫలహారం బండి ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ ముఖ్య అతిధిగా హాజరై పలహార బ ం డి ని ప్రారంభించారు. ఫలహారం బండి ఊరేగింపు ముందు పోతురాజులు, వివిధ వేషధారణలు, కళాకారుల ప్రదర్శనలు, నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని ఆదర్శ్ నగర్ కాలనీలో బోనాల ఉత్సవాలలో భాగంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతకింది రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండి కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ పాల్గొని



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలహార బండిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మారబోయిన రాజు యాదవ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, బాలింగ్ గౌతమ్ గౌడ్, ప్రసాద్, పద్మారావు,మల్లేష్, ఫక్రుద్దీన్ , ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ప్రసాద్,విక్రమ్ , భక్తులు తదితరులు పాల్గొన్నారు. భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## పురుగుల మందు సేవించి గిరిజన రైతు మృతి


**ఆళ్లపల్లి జూలై 30 నినాదం న్యూస్**



పురుగుల మందు సేవించి ఓ గిరిజన రైతు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని అనంతోగు గ్రామానికి చెందిన గలిగే సాంబశివరావు మద్యానికి బానిసై మంగళవారం ఉదయం పురుగుల మందు తాగాడు. అది గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతునికి ఒక కుమారుడు ఉన్నాడు. భార్య చనిపోయింది.

## ఆపరేషన్ 'కగార్'కు వ్యతిరేకంగా పోస్టర్లు

**- ఇల్లందులో కలకలం**




**ఇల్లందు,జూలై30(నినాదం న్యూస్):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులోని కొత్త బస్టాండ్ సమీపంలో అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు జరపాలని మంగళవారం ప్రత్యక్షమైన గోడ పత్రికలు ఒక్కసారిగా కలకలం రేపాయి.భారతావనిలో బ్రాహ్మణీయ మనువాద దోపిడీ నిర్మాణ లక్ష్యంతో ప్రజలపై కొనసాగుతున్న విప్లవ ప్రతిఘాతక కగార్ ఆపరేషన్ ను ప్రజా ఉద్యమాల ద్వారా ఓడిద్దామని పోస్టర్లు వెలిశాయి. జూలై 28 నుండి ఆగస్టు 3 వరకు గ్రామ గ్రామాన సంస్మరణ సభలు జరపాలని,మార్క్సిజం లెనినిజం మావోయిజం వర్ధిల్లాలని, నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలని,భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)వర్ధిల్లాలని ఆ పోస్టర్లలో ప్రచురించారు.

## బీఆర్ఎస్ యూత్ జవహర్ నగర్ అధ్యక్షులుగా పొలాస అశోక్ కుమార్

**కాప్రా జవహర్ నగర్ జూలై 30: నినాదం న్యూస్,**



జవహర్ నగర్ నగర్ బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడిగా పొలాస అశోక్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ మేరకు జవహర్ నగర్ బీఆర్ఎస్ నాయకులు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీకి పూర్వవైభవం తీసుకోస్తానాని,పార్టీ పటిష్టతకు అహర్నిషలు కృషి చేస్తానని అన్నారు.
యూత్ అధ్యక్షుడిగా నియామించినందుకు పార్టీ పెద్దలకు అశోక్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

## సీసీ రోడ్డు ప్రారంభించిన మేయర్

**మహేశ్వరం, జులై 30 (నినాదం న్యూస్)**
మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ లోని 27 వ డివిజన్ పరిధిలోని ఎంవీఎస్ఆర్ కళాశాల నుండి నుండి కమ్మగూడా వరకు సిసి రోడ్డు నిర్మాణ పనులకు ముఖ్య అతిథులుగా హాజరైన మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టులకు సూచించారు. ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకువచ్చేలా త్వరితగతిన పనులు పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు సమస్య తలెత్తకుండా చూడవలసిందిగా అధికారులకు సూచించారు స్థానిక సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు మేయర్ కోరారు ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట శ్రీధర్ రెడ్డి, గూడెపు ఇంద్రసేన, డీఈఈ జ్యోతి రెడ్డి, నాయకులు పేతుళ్ల ఆనంద్ రెడ్డి, బంగారి అశోక్, శివ రెడ్డి కాలనీవాసులు పెద్దలు అభిమానులు కార్యకర్తలు అధికారుల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# వాహనదారులను ట్రాఫిక్ నియంత్రణలో చూపాలి

**- సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కే రామస్వామి**

**చేవెళ్ల జులై 30 (నినాదం న్యూస్ ):**



ట్రాఫిక్ పోలీసులు వాహనదారులను ఫోటోలు తీయడంలో ఉన్న శ్రద్ధ, ట్రాఫిక్ ను నియంత్రించడంలో చూపాలని భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో చేవెళ్లలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామస్వామి మాట్లాడుతూ ట్రాఫిక్ పోలీసులు చలన పైన చూపి అత్యుత్సాహము ట్రాఫిక్ నియంత్రణ కూడా చూపాలని అన్నారు.చేవెళ్ల పట్టణ కేంద్రంలో బస్టాండ్ వద్ద శంకర్పల్లి చౌరస్తా వద్ద నిత్యము ట్రాఫిక్ తో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని నిత్యము పొలము పనులు చేసే రైతులు విద్యార్థులు ఉద్యోగులు వివిధ పనుల అత్యవసర పరిస్థితుల్లో స్థానిక ప్రజలు రోడ్లపైకి వాహనాలతో వస్తూ ఉంటారు స్థానికంగా ఉన్న ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ ను నియంత్రించకపోగా కెమెరాలు పట్టుకుని ఫోటోలు తీయడమే వారి డ్యూటీ గా భావిస్తున్నారు అని రోడ్డు ప్రమాదాల పైన వాహన చోదకులు తీసుకోవలసిన జాగ్రత్తల పైన ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు ట్రాఫిక్ చెకింగ్ పాయింటును మండల సెంటర్ నుండి కిలోమీటర్ తర్వాత పెడితే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు ట్రాఫిక్ పోలీసులు తీరు మార్చుకోకుంటే భవిష్యత్తులో రైతులు విద్యార్థులు ప్రజలతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ బి కే యం యు జిల్లా అధ్యక్షుడు జే అంజయ్య మండల పార్టీ సహాయ కార్యదర్శి ఎండి మక్బుల్ మండల మహిళా సంఘం అధ్యక్షురాలు వడ్ల మంజుల ఏ టు సి మండల అధ్యక్షుడు శివ కార్యదర్శి శివయ్య ఆనందం యాదగిరి పెంటయ్య శ్రీకాంత్ తదితరులు ఉన్నారు..

## తెలంగాణ ఉద్యమకారులు హామీలు నెరవేర్చాలి

**-టీయూఎఫ్ పార్లమెంట్ ఇంచార్జి యాలాల మహేశ్వర్ రెడ్డి**



**చేవెళ్ల జులై 30 (నినాదం న్యూస్)ః**
కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సభ్యులు గాంధీ భవన్ చేరుకోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారికి వినతి పత్రం చెరె విదంగా పిసిసి వైస్ ప్రెసిడెంట్ కి లేక అందజేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు ఎన్నో పోరాటాలు, పోలీసుల లాఠీ దెబ్బలు, అక్రమ కేసులు నమోదు చేశారని తెలంగాణ ఫోరం పార్లమెంట్ ఇంచార్జి యాలాల మహేశ్వర్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల ముందు ఇచ్చిన 250 గజాల ఇంటి స్థలం హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించుకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో చేవెళ్ళ మండల ఉద్యమకారుల ఫోరమ్ అధ్యక్షులు కరికే మల్లేష్, శేఖర్ రెడ్డి, కారుణకర్ రెడ్డి సత్యనందం తదితరులు పాల్గొన్నారు.

## గాలి పోచమ్మ ఆలయంలో పూజలు

**కుత్బుల్లాపూర్, జూలై 30 (నినాదం న్యూస్)**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ రావి నారాయణరెడ్డి నగర్ పరిధి గాలి పోచమ్మ బస్తీలో వెలిసిన శ్రీ గాలి పోచమ్మ ఎల్లమ్మ దేవి ఆలయంలో ఆషాడ మాస బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. బోనాల వేడుకలను ఆలయ కమిటీ సభ్యులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఎంతో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలు ప్రారంభించారు. వందలాది మది భక్తులు తరలివచ్చి దేవతామూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. తమ కుటుంబాలు, పిల్లాపాపలు, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని మొక్కుకొని కోళ్లు, మేకలు, గొర్రెలను అమ్మవారికి బలి ఇచ్చారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు నెత్తిన బోనం ఎత్తుకొని వీధులలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పోతరాజులు శివసత్తుల విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ వారు ఆషాడ మాస బోనాల సందర్భంగా భక్తులకు ఎటువంటి సౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకొని ఏర్పాట్లు చేశారు.



## అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు ఇవ్వండి

**- సీఎం రేవంత్ రెడ్డిని కోరిన ఎమ్మెల్యే కాలే యాదయ్య.**



**చేవెళ్ల జులై 30 (నినాదం న్యూస్ ):**
చేవెళ్ల నియోజకవర్గం అభివృద్ధి కొరకు ప్రత్యేక నిధులను కేటాయించాలని, ముఖ్యమంత్రిఏనుముల రేవంత్ రెడ్డి ని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య కోరారు. మంగళవారం అసెంబ్లీ ప్రాంగణంలో ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి గారిని చేవెళ్ళ శాసన సభ్యులు కలిసి వినతి పత్రం అందించారు. చేవెళ్ల నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను పూర్తి చేయడానికి ప్రత్యేక నిధులను కేటాయించాలని కోరారు. మంగళవారం హైద్రాబాద్‌లోని అసెంబ్లీ ప్రాంగణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని ఎమ్మెల్యే కాలే యాదయ్య గారు. మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించడంతో పాటు పలు సమస్యలను విన్నపించారు. దీనిపై ముఖ్యమంత్రి గారు సానుకూలంగా స్పందించారు.

## హైస్కూల్‌లో ప్రధానమంత్రి పోశన్

**- విద్యార్థులకు పండ్లు పంపిణీ చేసిన కౌన్సిలర్ జక్కుల కృష్ణ యాదవ్**




**కుత్బుల్లాపూర్, జూలై 30 (నినాదం న్యూస్)**
కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానమంత్రి పోషణ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానమంత్రి పోషన్ కార్యక్రమంలో భాగంగా క్రీ. శే. జక్కుల ఐశ్వర్య జ్ఞాపకార్థం దుండిగల్ జిల్లా పరిషత్ హైస్కూల్లో కౌన్సిలర్ జక్కుల కృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అరటిపళ్ళు, ఆపిల్ పండ్లు నాణ్యమైన పోషకాలు అందజేశారు. అనంతరం జక్కుల కృష్ణ యాదవ్ మాట్లాడుతూ రానున్న కాలంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తనకు తోచిన సహాయ సహకారాలు అందిస్తానన్నారు.కార్యక్రమంలో కౌన్సిలర్ ఆనంద్ కుమార్, ప్రధానోపాధ్యాయులు ముత్యం గౌడ్, అధ్యాపక బృందం, స్థానిక నాయకులు కుంటి వెంకటేష్, ఈ శ్రీనివాస్ గౌడ్, బాల్ రాజ్ యాదవ్,నర్సింగ్ గౌడ్, అరుణ్ గౌడ్,ఏలూరి శివుడు, రాజు గౌడ్,పిట్ల రమేష్, భాను గౌడ్, తలారి రాజు,నాగరాజ్, తదితరులు పాల్గొన్నారు

# ఆశ వర్కర్ల అరెస్టులు అప్రజాస్వామీకం : సిఐటియు



**చేవెళ్ల జులై 30(నినాదం న్యూస్):**
తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా చలో హైదరాబాద్ కు బయలుదేరుతున్న చేవెళ్ల మండల ఆశా కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల కంటే ముందు ఆశా కార్యకర్తల సమ్మె సందర్భంగా వారి టెంట్ల వద్దకు వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 18,000 ఫిక్స్ వేతనం ఇస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని నిలబెట్టుకోవాలని అనేక సందర్భాలలో ప్రభుత్వాన్ని కోరమన్నారు. అయిన పరిష్కారంకానందున, రాష్ట్రవ్యాప్తంగా యూనియన్ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కు పిలుపునిచ్చారు ఆశా కార్యకర్తలు శాంతియుతంగా ధర్నా కార్యక్రమానికి వెళుతుంటే పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి సీఐటీయూ నాయకుల ఆశా కార్యకర్తల ఇంటి వద్దకు వచ్చి అక్రమంగా సంఘ విద్రోహ శక్తులను అరెస్టు చేసినట్లుగా పోలీసులు అరెస్టు చేశారని అన్నారు ఈ అరెస్టులను చూస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా కెసిఆర్ బాటలో నడుస్తున్నాడని రాబోయే రోజులలో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు.

**ఇది ప్రజా పాలన నా? లేక**

**ఆశా కార్యకర్తల ముందస్తు అరెస్టులు**

**భీమదేవరపల్లి జూలై30 (నినాదం న్యూస్)**
ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.18వేల ఇవ్వాలని గతంలో సమ్మె చేస్తే ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్, సిఐటియు రాష్ట్ర కమిటీ చలో హైదరాబాద్ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో మంగళవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం నుండి నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న ఆశా కార్యకర్తలను పోలీసులు ఎక్కడిక్కడ అడ్డుకున్నారు. ఆశా కార్యకర్తలను అరెస్టు చేసి ములుకనూరు పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్, సిఐటియు నాయకులు మాట్లాడుతూ అరెస్టులు నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని, సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం మహిళలను అర్ధరాత్రి అరెస్టులు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పదే పదే ప్రజాస్వామ్యం గురించి మాట్లాడు తూ అక్రమ అరెస్టులు చేయడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యం ప్రతిఒక్కరికి సమస్యలు, అసంతృప్తి తెలిపే హక్కు ఉంటుందని నిర్బంధంతో అణిచివేస్తే గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి పడుతున్నారు.




# నాయకుల ముందస్తు అరెస్టులను ఖండిస్తున్నాం : సిఐటియు

**మునగాల, జులై 30 (నినాదం న్యూస్):**
గ్రామపంచాయతీ కార్మికులు రాష్ట్ర ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సిఐటియు అనుబంధ సంఘం, గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ ఎండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన చలో హైదరాబాద్ ధర్నా కు పోకుండా అడ్డుపడి రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు అరెస్టులు చేయించడం ఖండిస్తున్నామని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బచ్చలకూర స్వరాజ్యం అన్నారు. సోమవారం సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ ఎండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన చలో హైదరాబాద్ ధర్నా పిలుపులో భాగంగా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వ దృష్టికి తీసుక వెళ్తున్న కార్మికులను ముందస్తు అరెస్టులు చేయడం నిర్బంధించడం సరియైనది కాదని అన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా జాప్యం చెయ్యాలని చేస్తుందని జాప్యం చేస్తే గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించి వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ మండల కార్మిక అధ్యక్షులు ఎల్ నాగార్జున,ధారా రవి,సిహెచ్ వెంకటేష్,రాజేష్,రేణుక, ఉదయమ్మ,నాగలక్ష్మి,బిక్షం దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.




# మురుగు నీరుతో రోడ్లు, కాలనీలు

### - పట్టించుకోని అధికారులు

**అల్వాల్, జూలై 30( నినాదం న్యూస్)**
మహాత్మ గాంధీ నగర్ కాలనీ మాచా బోలారం 133 డివిజన్లో ఉనా శ్మశాన వాటిక నుండి డ్రైనేజీ నీరూ చాలా సంవత్సరాల నుండి కాలనీ వైపు పొంగిపొర్లుతోంది, మేడ్చల్ మల్కాజిగిరి మానవ హక్కుల చీఫ్ డాక్టర్ ప్రదీప్ అరుణోదయ్ కొని సంవత్సరాలు నుండి ఎక్స్(ట్విట్టర్) లో ఫిర్యాదులు చేస్తున్నారు, ఫిర్యాదు చేసిన ప్రతి సారి హెచ్ఎం డబ్ల్యూ ఎస్ ఎస్ బి అధికారులు వచ్చి సమస్యను తాత్కాలికంగా క్లియర్ చేస్తున్నారు మరుసటి రోజే మళ్లీ నీరు పొంగిపొర్లుతోంది, వేసవిలో కొత్త పైప్లైన్ వేస్తామని హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ అధికారులు కొన్నేళ్ల క్రితం హామీ ఇచ్చి ఇంకా పూర్తి చేయలేదు. పక్కనే ఉన్న అమ్మవారి ఆలయంలో వచ్చే సోమవారం బోనాల పండుగ ఉంది, బోనం మోసే భక్తులు ఈ మురికి నీటి ప్రాంతం నుండి నడవాలి. కనీసం ఇప్పటికైనా అధికారులు సమస్యను తక్షణమే పరిష్కరించాలి. రాబోయే రోజుల్లో గణేష్ చతుర్థి, దసరా వంటి పెద్ద పండుగలు ప్రారంభమవుతున్నందున దీనికి శాశ్వత పరిష్కారం చూపాలి. ఇది మాత్రమే కాదు, ఇది వర్షాకాలం మరియు దీని కారణంగా ప్రజలు త్వరగా సీజనల్ వ్యాధుల బారిన పడవచ్చు, అధికారులు అవసరమైన చర్యలు తీసుకుని స్థలాన్ని పరిశుభ్రంగా ఉంచాలని డాక్టర్ ప్రదీప్ అరుణోదయ్ కోరారు.



# కాలనీ సమస్యలపై వినతి పత్రం అందజేత

**అల్వాల్, జూలై 30 (నినాదం న్యూస్)**
మచ్చ బొల్లారం డివిజన్ పరిధిలోని జి ఎన్ ఆర్ కాలని, బంజార కాలని, విజయ విహార్ కాలనీ సిద్ధి వినాయక నగర్లో మంచినీటి కనెక్షన్ ఇవ్వాలని కోరుతూ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి వినతిపత్రం అందజేసిన స్థానికులు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఇదివరకే నియోజకవర్గ నీటి సమస్యల మీద వాటర్ వర్క్స్ యం.డి. అశోక్ రెడ్డిని కలిసి మాట్లాడడం జరిగిందని, త్వరలోనే యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభం అయ్యేలా అధికారుల పై వత్తిడి తీసుకొస్తానని అన్నారు, ఈ కార్యక్రమంలోవేణు, మాధవ్,ఆకాశ్, బుచ్చిబాబు అభిషేక్ సింగ్, ఉప్పలయ్య తదితరులు ఉన్నారు.





# బీసీ రిజర్వేషన్లను పెంచి ఎన్నికలు జరపాలి: చొప్పరి శేఖర్





**కేసముద్రం జులై 30 (నినాదం న్యూస్)**
స్థానిక ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించడం హర్షనీయమని, బీసీ రిజర్వేషన్లను పెంచి ఎన్నికలు జరపాలని బీసీ జిల్లా సాధన సమితి అధ్యక్షులు చొప్పరి శేఖర్ రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. సోమవారం నాడు చొప్పరి శేఖర్ మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల ముందు బిసి డిక్లరేషన్ ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పెంచి స్థానిక ఎన్నికలు నిర్వహించాలని, స్థానిక ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి సంబంధిత అధికారుల ఆదేశించడం, బిసి కమిషన్ త్వరగా రిజర్వేషన్లకు సంబంధించిన నివేదిక ఇవ్వాలని కోరడం హర్షణీయమని అన్నారు. రాష్ట్రంలో బీసీ కుల గణన ముందు ప్రతిపాదికన నిర్వహించి కులాల జనాభా లెక్కలను తీయాలన్నారు. ఇప్పటికే సామాజిక ఆర్థిక రాజకీయ అన్ని రంగాలలో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని దానిని దృష్టిలో పెట్టుకొని తక్షణమే బీసీల డిమాండ్లను పరిష్కరించాలన్నారు. రాష్ట్ర జనాభాలో సగానికి పైగా బీసీలకు బడ్జెట్లో తగిన విధంగా నిధులు కేటాయించకపోవడం అన్యాయన్నారు. ఇప్పటికైనా పునరాలోచన చేసి బీసీల సంక్షేమానికి ఉపాధి అభివృద్ధికి 25 వేల కోట్లు కేటాయించేందుకు తగిన చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

### - అసెంబ్లీ ముట్టడి-నిలిచిన పనులు

**కేసముద్రం జులై 30 (నినాదం న్యూస్)**
తెలంగాణ సమగ్ర శిక్షా కింద అన్ని జిల్లాల్లో ని కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ఉద్యోగుల అందరూ ఈ రోజు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని పిలుపినివ్వడం జరిగిందీ. దీనిలో భాగంగా కేసముద్రం మండల విద్యా వనరుల కేంద్రం (ఎమ్మార్సీ)లో పనిచేస్తున్న ఉద్యోగులు అసెంబ్లీ ముట్టడి కి బయలుదేరడం జరిగింది. దీనితో మండల విద్య వనరుల కేంద్రం(ఎమ్మార్సీకి) తాళం పడింది.ఎమ్మార్సీ ఉద్యోగులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గత సెప్టెంబర్ లో కాంట్రాక్టు ఉద్యోగులు సమ్మె చేస్తున్న కాలంలో వరంగల్ కు వచ్చిన సందర్భంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నెల రోజుల్లో నే కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి జి. ఓ ఇప్పిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటికీ కొత్త ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోవడం తో తప్పనిసరి పరిస్థితుల్లో అసెంబ్లీ ముట్టడి కి పిలుపునివ్వడం జరిగిందని, ఇప్పటికయినా ప్రభుత్వం మేల్కొని టి ఎస్ ఎస్ కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులర్ చేస్తూ మినిమం టైం స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మండల ఎం ఆర్ సి ఉద్యోగులు శ్రీ షేక్ ఖాదర్, బాణోత్ భిక్షపతి, వెన్ను భిక్షపతి,సీఆర్పీలు , మురళి, స్వాతి ,సరితా, సుల్తానా పద్మ ,నాగమణి, ఐ ఈ ఆర్ పి లు ఉపేందర్, వెంకటరమణ, పి టి ఐ లు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమమే టీయూడబ్ల్యూజె ధ్యేయం

**- త్వరలో జర్నలిస్టులకు తీపి కబురు**

**-టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ**





**శేరిలింగంపల్లి,జూలై 30: (నినాదం న్యూస్ ):**
విలేకరులు తమ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవడమే కాకుండా, ట్రేడ్ యూనియన్ విది విధానాలపై అవగాహన కల్పించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ సూచించారు. మంగళవారం యూనియన్ రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మియాపూర్ హోటల్ అశోక గ్రాండ్ లో నూతన రాష్ట్ర కమిటీకి ఆత్మీయ సన్మానం నిర్వహించారు.ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ లో రంగారెడ్డి,హైదరాబాద్,మేడ్చల్ జిల్లాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నాయకులకు శేరిలింగంపల్లి యూనియన్ జర్నలిస్టులు సత్కరించారు.రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన విరాహత్ అలీని,కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి ని,కోశాధికారి వెంకట్ రెడ్డి లను ఘనంగా సత్కరించారు.ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎండి సలీమ్ పాషా ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి శాఖ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు.గడిచిన పదేళ్ల కాలంలో విలేకరుల సమస్యలు పరిష్కారానికి నోచుకోక అనేక ఇబ్బందుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.దేశంలో జర్నలిస్టుల గొంతుకగా పోరాటం చేస్తున్న కె.శ్రీనివాస్ రెడ్డికి ప్రస్తుత ప్రభుత్వం తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ పదవిని అప్పగించడం ద్వారా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం చేసిందన్నారు. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో మునుపెన్నడూ లేని విధంగా సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో విలేకరుల సమస్యలపై తరచుగా సమావేశాలు, చర్చలు జరుగుతున్నాయన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జర్నలిస్టులు ఆరోగ్య పథకాన్ని కోల్పోవడంతో,సరైన వైద్య సదుపాయాలు అందక పలువురు విలేకరులు ప్రాణాలను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుత ప్రభుత్వం జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యతనిస్తూ త్వరలోనే హెల్త్ కార్డులను అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.అర్హుడైన ప్రతి విలేఖరికి అక్రిడిటేషన్ అందాల్సిన అవసరం ఉందని,అయితే మార్కెట్లో విచ్చలవిడిగా ఎవరికి పడితేవారికి అక్రిడిటేషన్లు దొరకడం విచారకరమన్నారు.నికార్సైన జర్నలిస్టులు మార్కెట్లో అంగడి సరుకుగా మారిన అక్రిడిటేషన్లను అడ్డుకోవాల్సిన అవసరం ఉందని విజ్ఞప్తి చేశారు.అర్హులైన జర్నలిస్టులందరికీ మండల జిల్లా కేంద్రాలుగా పరిగణలోకి తీసుకుంటూ ఇళ్ల స్థలాలను మంజూరు చేసే విధంగా యూనియన్ కృషి చేస్తుందని స్పష్టం చేశారు.గతంలో ఓ సంఘం ప్రభుత్వం తమ జేబులో ఉందని చెప్పుకుంటూనే జర్నలిస్టులను మోసం చేసిందని ఆరోపించారు. ప్రభుత్వ పెద్దలు బహిరంగంగా ఎలాంటి ప్రకటనలు చేయనప్పటికీ పాలాభిషేకాలు చేస్తూ లేనిపోని భ్రమలను కల్పించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇలాంటి సంఘాలతో జర్నలిస్టులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి జాతీయ కౌన్సిల్ మెంబర్ సలీం మాట్లాడుతూ జర్నలిస్టులో నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్నారని,జర్నలిజం అనేది కొంతమంది వ్యక్తులకు వ్యాపార రంగంగా చూస్తున్నారని ఆయన తెలిపారు.కానీ జర్నలిజంలో అనేక సంవత్సరాలు పనిచేస్తూ కుటుంబంలో అటు సొసైటీలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలుగా నేడు జర్నలిస్టులకు గుర్తింపు ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నికాసిగా పనిచేసే జర్నలిస్టు నిరంతరం అటు ప్రభుత్వ యంత్రాంగం ఇటు రాజకీయం అన్ని వర్గాల నుండి దాడులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు.జర్నలిజం కోసం పనిచేసిన ఎంతోమంది సీనియర్ పాత్రికేయులు అనేక భౌతిక విదారులకు గురై మరణించిన సంఘటన కూడా ఉన్నాయని ఆయన తెలిపారు.నిరంతరం ప్రజలకు వాస్తవాలను వెల్లడించడం కోసం అనునిత్యం కుటుంబానికి దూరమై ప్రజల మధ్య ఉండే వ్యక్తి కేవలం జర్నలిస్టు మాత్రమే అని ఆయన తెలిపారు.గత రాష్ట్ర ప్రభుత్వం పది సంవత్సరాలుగా జర్నలిస్టులకు ఇచ్చిన మాటను ఏ ఒక్కటే నెరవేర్చలేదని అందుకు జర్నలిస్టులు కూడా నిరంతరం పోరాటం చేశారని తెలిపారు.

ఆ పోరాటంలో టీయూడబ్ల్యూజే ఎప్పుడు జర్నలిస్టు సమస్యల కోసం ముందుండి పోరాడిందని తెలిపారు.ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడం కోసం శాంతియుత మార్గంలో ప్రయత్నం చేస్తున్నామని ప్రభుత్వం జర్నలిస్టు సమస్యలు పరిష్కరించకపోతే పోరాటమే ఏకైక మార్గమని ఆయన గుర్తు చేశారు.

ఈ కార్యక్రమంలో చిన్న పత్రికల సంఘం రాష్ట్ర అధ్యక్షులు యూసుఫ్ బాబా,ప్రధాన కార్యదర్శి వై అశోక్ , రంగారెడ్డి, హైదరాబాద్,మేడ్చల్ జిల్లాల అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి,శంకర్ శిగా,బాలరాజు,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేష్,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కిషన్, సత్యనారాయణ,శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్ రావు,నాగవేందర్ రెడ్డి,జిల్లా జాయింట్ సెక్రటరీ శ్రీనివాసులు గౌడ్, కార్యవర్గ సభ్యులు దారుగుపల్లి సత్యనారాయణ, సీనియర్ జర్నలిస్ట్ నాయకులు కొండా విజయ్ కుమార్, తిరుపతి రెడ్డి,మాధవ రెడ్డి, ప్రణయ్ ముదిరాజ్,అశోక్ యాదవ్,వరుణ్,డి శ్రీనివాస్, సాద నరేష్, ప్రవీణ్,గోవర్ధన్ రెడ్డి,నాగేష్,శంకర్,యాసిన్, రమేష్,కబీర్ కౌశల్,గన్నాల అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## ఘనంగా పలహారం బండి ఊరేగింపు



**శేరిలింగంపల్లి,జులై 30 (నినాదం న్యూస్) :**
తెలంగాణ రాష్ట్ర సంస్కృతి ,సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పర్వదినం సందర్భంగా హఫీజ్పేట్ డివిజన్ పరిధిలోని గంగారాంలో బోనాల ఉత్సవాలలో భాగంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కంది జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ గారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సంస్కృతి ,సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పర్వదినం సందర్భంగా ప్రజలందరికి బోనాల పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. బోనాలు అంగరంగ వైభవంగా నిర్వహించుకొనేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరుచేయడం పట్ల సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే గాంధీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రఘునాథ్ రెడ్డి, మోహన్ ముదిరాజు,బాలింగ్ గౌతమ్ గౌడ్ , ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్,రాజు, నరేందర్ బల్లా, గోపి, తులసి దాసు,శ్రీనివాస్ యాదవ్, శ్రవణ్, వీరేందర్, మధుకర్, మరియు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఇండ్లు కోల్పోయిన బాధితులకు న్యాయం చేయాలి

**కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి**



**శేరిలింగంపల్లి,**
**జులై 27 (నినాదం న్యూస్) :**
గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని బసవతారక నగర్ లో ఇండ్లు కోల్పోయిన బాధితులకు న్యాయం చేయాలని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆరెక పూడి గాంధీ ని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి తప్పకుండా సరైన న్యాయం చేస్తానని,అర్హులైన ప్రతి ఒక్కరికి తప్పకుండా న్యాయం చేస్తానని ఎమ్మెల్యే గాంధీ హామీ ఇచ్చారు..ఈ కార్యక్రమంలో గోపనపల్లి తండా వడ్డెర సంఘం అధ్యక్షులు శ్రీరాములు, సీనియర్ నాయకులు ముళగిరి శ్రీనివాస్,ప్రభాకర్,రమేష్, రంగస్వామి ,సురేష్, రాజు , సత్య శ్రీశైలం,బసవతారక నగర్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లి నూతన ప్రెస్ క్లబ్ ఎన్నిక

**-జర్నలిస్టుల హక్కుల కోసం కృషి చేస్తా**

**-కొండా విజయ్ కుమార్**



**శేరిలింగంపల్లి జులై 30 : (నినాదం న్యూస్)**
టియుడబ్ల్యూజే రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి నూతన ప్రెస్ క్లబ్ కమిటీ శ్రీకాంత్ రెడ్డి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షులు కొండ విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా గుర్రాల తిరుపతిరెడ్డి,ఉపాధ్యక్షులుగా డి.శ్రీనివాస్, ప్రణయ్,అశోక్ యాదవ్,కోశాధికారి వరుణ్, జాయింట్ సెక్రటరీలుగా సాద నరేష్,గోవర్ధన్ రెడ్డి,ప్రవీణ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ గా మల్లేష్,శంకర్, నాగరత్నం, ఎండి యాసిన్,రమేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం అభివృద్ధి కోసం పాటుపడతామన్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు,హెల్త్ కార్డులు, అక్రిడేషన్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి జర్నలిస్టులు పాల్గొన్నారు.

## ఇది ప్రజా పాలన నా? లేక నిర్బంధాల పాలన నా ?

**- అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు**

**- ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు రామస్వామి**

**- జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ**



**చేవెళ్ల జులై 30 (నినాదం న్యూస్ ):**
ఇది ప్రజా పాలన లేక అక్రమ అరెస్టుల నిర్బందాల పాలననా? అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామస్వామి విమర్శించారు.
గ్రామపంచాయతీ, మున్సిపల్ లో పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికుల న్యాయమైన హక్కుల సాధనకై ఇందిరా పార్కు దగ్గర ఈరోజు తలపెట్టిన మహా ధర్నా కార్యక్రమానికి వెళుతున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ కౌన్సిల్ సభ్యురాలు వడ్ల మంజుల జిల్లా మండల పార్టీ కార్యదర్శి ఏం సత్తిరెడ్డి సహాయ కార్యదర్శి ఎం డి మక్బూల్ గీత పనివాళ్ల సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణ గౌడ్ తదితరులను అక్రమంగా రెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కే రామస్వామి మాట్లాడుతూ గత పది సంవత్సరాల కేసీఆర్ పాలనలో ఉద్యమాలను అక్రమ అరెస్టులతో ఏ విధంగా అడ్డుకున్నారో ఈరోజు తెలంగాణలో పరిపాలిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇదిప్రజా పాలన ప్రభుత్వం అని చెప్పుకొని అక్రమ అరెస్టులు నిర్బంధాలు చేస్తుంది రాష్ట్రంలో ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా ఇందిరా పార్క్ దగ్గర ధర్నాలు చేసుకోవచ్చని ఇది ప్రజా పాలన అని స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా చెప్పిన విషయాన్ని పెడచెవిన పెట్టి ఒకపక్క ధర్నా చేసుకోవచ్చని ప్రభుత్వము పర్మిషన్ ఇచ్చి ఇంకొకపక్క పోలీసులతో అక్రమ అరెస్టులను చేయడం హేయమైనా చర్యా అని గత ప్రభుత్వానికి ప్రస్తుతం ఉన్న ప్రభుత్వానికి ఏమి పెద్దగా తేడా లేదని అన్నారు అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు శివ ప్రధాన కార్యదర్శి డప్పు శివయ్య బాబురావు యాదగిరి ఆనందం లలిత రమాదేవి పెంటయ్య తదితరులు ఉన్నారు..

## అనంతగిరి తహసీల్దార్‌గా హిమబిందు బాధ్యతలు



**కోదాడ,జూలై 30(నినాదం న్యూస్):** అనంతగిరి ఎమ్మార్వో గా హిమబిందు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నాగర్ కర్నూలు జిల్లా కొల్లాపూర్ మండలం నుండి బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ అనంతగిరి ఎమ్మార్వోగా పని చేసిన రవికుమార్ భువనగిరి జిల్లా కలెక్టరేటకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన హిమబిందు మాట్లాడుతూ... మండలాన్ని అభివృద్ధి పథంలో తీసుకు వెళ్లేందుకు ప్రజలు ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. అనంతరం ఎమ్మార్వో పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

### లక్షన్నర రుణమాఫీ అయిన రైతుల ఇండ్లలో

## ఇవాళ పండుగ రోజు

### వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు



**వరంగల్ జిల్లా ప్రతినిధి జూలై 30 (నినాదం న్యూస్):** రైతు రుణమాఫీతో తన జన్మధన్యం అయిందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. రాష్ట్ర మంతా రుణాల మాఫీతో పండగ వాతావరణం నెలకొంది అని తెలియజేసిన ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు.లక్షన్నర రూపాయల వరకు రుణాలను మాఫీ చేసిన రేవంత్ రెడ్డి ఓట్ల కోసమో, ఎన్నికల కోసమో రైతు రుణమాఫీ చేయడం లేదని తెలిపారు. ఒకేసారి రైతుల కోసం 31వేల కోట్లు బ్యాంకులకు చెల్లించిన రికార్డు తమ ప్రభుత్వానిదని పేర్కొన్నారు.ఈ రెండు నెలలు చరిత్ర లో నిలిచి పోతాయని ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు తెలియజేయడం జరిగినది. గతంలో అనేక మంది రైతు లు సొంత పొలంలోనే పురుగుల మందు తాగి ప్రాణాలు కోల్పోయారు.ఏ రైతు కూడా ఆర్థిక సంక్షోభం లో కూరుకుపోకూడదనేదే మా విధానం అందుకే ఇవాళ రూ. లక్షన్నర వరకు ఉన్న రైతు రుణాలన్నీ మాఫీ చేశాం. రాష్ట్రంలోని రైతులందరి ఇళ్లల్లో ఇవాళ పండుగ రోజు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీ చేశారు. రెండో విడతగా రూ 6,190 కోట్లు మాఫీ చేశాం అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా మొదటి విడత, రెండో విడత రుణమాఫీలో దాదాపు 2 లక్షల 8 వేల మంది రైతులకు సుమారు 15 వందల కోట్ల రూపాయలు రుణమాఫీ చేసిన గొప్ప ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రుణమాఫీ కింద సుమారు 6.4 లక్షల మంది రైతుల ఖాతాల్లో రెండో విడతగా రూ 6,190 కోట్లు జమ చేసింది. తొలి విడతలో 11.34 లక్షల మంది రైతులకు రూ 6,035 కోట్లు విడుదల చేశారు. ఇప్పటి వరకు 17.75 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరింది.రెండు దశల్లో కలిపి రైతుల ఖాతాల్లో రూ 12,225 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం జమ చేసిందని ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు తెలియజేయడం జరిగినది.ఈ సందర్భంగా వర్ధన్నపేట నియోజకవర్గ, ఉమ్మడి వరంగల్ జిల్లా రైతుల పక్షాన వరంగల్ సభలో ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేసి నిరూపించిన తల్లి సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి బట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి (అనసూయ) సీతక్క కు కృతజ్ఞతలు తెలియజేసిన వర్ధన్నపేట శాసనసభ్యులు,మాజీ ఐపీఎస్ అధికారి కె ఆర్ నాగరాజు.

### అంబేద్కర్ వర్సిటీ కోర్సులలో ప్రవేశాలకు నోటిఫికేషన్

### ప్రిన్సిపల్ ఎండీ తాహీర్ హుస్సేన్

**మంథని జులై 30( నినాదం న్యూస్):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ (బి.ఏ/ బీకాం/ బీఎస్సీ) కోర్సుల్లో 2024 - 25 విద్యా సంవత్సర ప్రవేశాల కోసం నోటిఫికేషన్ జారీ చేయడమైనదని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మంథని ప్రిన్సిపల్ ఎండీ తాహీర్ హుస్సేన్, కోఆర్డినేటర్ కర్నాటి కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సుల్లో ప్రవేశాలకు ఆగస్టు 18వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు. కోర్సుల్లో చేరడానికి విద్యార్హతలు, ఫీజు తదితర వివరాలను వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చునని అలాగే ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువు తున్న విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించాలని, డిగ్రీ 2015-16 నుండి 2023- 24 వరకు అడ్మిషన్ పొంది ఫీజు సకాలంలో చెల్లించని వారు కూడా ఆగస్టు 18లోపు ట్యూషన్ ఫీజు చెల్లించాలని తెలిపారు. వివరాలకు అధ్యయన కేంద్రంలో లేదా 7382929649లో సంప్రదించాలని అన్నారు.

# కాంగ్రెస్ రైతుల పక్షపాతి ప్రభుత్వం...

### మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్



**మంథని జులై 30 (నినాదం న్యూస్):** కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షపాతి ప్రభుత్వమని మంథని సింగిల్విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. పెద్దపల్లి కలెక్టరేట్ లో మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, పలువురు ఉన్నతాధికారుల సమక్షంలో రెండో విడత రుణమాఫీ జాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంథని ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ వరంగల్ డిక్లరేషన్ సభలో రైతులకు ఇచ్చిన రూ.2లక్షల రుణమాఫీ హామీ మేరకు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్, ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నేతృత్వంలో రైతు లందరికి రెండు విడతలు రుణమాఫీ చేసుకోవడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు లక్షా యాభై వేల రూపాయల వరకు రుణమాఫీ చేసుకోవడం జరిగిందని, ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15లోగా అందరి రైతులకు రూ.2లక్షల రుణ మాఫీ చేయడం జరుగుతుందని అన్నారు. రైతులపై ప్రభుత్వానికి ఉన్న మమకారానికి రూ.2లక్షల రుణమాఫీ నిదర్శనమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటీ, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మాత్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వర్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ ఎలక్షన్ కమిషన్ కో ఆర్డినేషన్ కమిటీ మెంబర్ శశిభూషణ్ కాచే, మాజీ ఎంపిపి కొండ శంకర్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముస్కుల సురందర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్‌నాయకులుఅజీంఖాన్, బండారి ప్రసాద్, రేపాక శ్రీకాంత్, ఆయా శాఖల జిల్లా, మండల అధికారులు, సింగిల్ విండో చైర్మన్లు, ప్రజాప్రతి నిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

### అర్హులైన వారందరికీ కూరగాయల

# విక్రయ దుకాణాల కేటాయింపులు

### మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేత..



**బెల్లంపల్లి జులై 30 (నినాదం న్యూస్):** బెల్లంపల్లిలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ కూరగాయల విక్రయ దుకాణాల సముదాయంలో అర్హులైన ప్రతి ఒక్కరికి పూర్తి స్థాయిలో విక్రయ దుకాణాల కేటాయింపులు జరుగుతా యని బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేత తెలిపారు.మున్సిపల్ కార్యాలయంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాల మేరకు మంగళ వారం మున్సిపల్ కౌన్సిల్ సభ్యుల సమక్షంలో బెల్లంపల్లి మార్కెట్‌లోని కూర గాయల విక్రయదారుల సంఘం అధ్య క్షులు,ఉపాధ్యక్షులు అసోసియేషన్ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతు మొత్తం180మంది కూరగాయల విక్రయ దారుల జాబితాలోని కుటుంబ సభ్యులలో ఇంటికి ఒకరి చొప్పున 30 నుండి 40సంవత్స రాల వరకు కూరగాయల మీదనే ఆధా రపడి కూరగా యలు అమ్ముకునే వారిలో నుండి108మంది లబ్ధిదారుల జాబితాను మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బందితో సర్వే చేయడం జరుగుతుందని తెలిపారు.మరో వారం రోజుల్లో బెల్లంపల్లి ఎమ్మెల్యే,జిల్లా కలెక్టర్ ల సమక్షంలో మొదటి విడతగా108మందికి కూరగాయల విక్రయ దుకాణాల కేటాయింపులు జరుగుతాయని చైర్ పర్సన్ తెలిపారు.మిగిలిన లబ్ధిదారులకు రెండవ విడత లో కూరగాయల విక్రయ కేంద్రాలు కేటాయించబడతా యని ఆమె తెలిపారు.ఈ సమావేశంలో ఇంచార్జి మున్సి పల్ కమిషనర్ వెంకటేశ్వర్లు,పలు వార్డుల కౌన్సిల్ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలి...

### మంథని సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజు గౌడ్



**మంథని జులై 30 (నినాదం న్యూస్):** ఆటోలో ప్రయాణించే వారితో డ్రైవర్లు మర్యాదగా ప్రవర్తించాలని మంథని సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. రాజు గౌడ్ అన్నారు. సోమవారం మంథని బస్టాండ్ ఆవరణలో మున్సిపల్ కమిషనర్ జి. మల్లికార్జున స్వామి తో కలిసి ఆటో డ్రైవర్లతో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై వాహనాలు నిలపరాదన్నారు. ఆటోలో ప్రయాణికులను కెపాసిటీకి మించి ఎక్కించుకోరాదని సూచించారు. అందరూ బ్యాడ్జి కలిగి ఉండాలని విధిగా యూనిఫామ్ ధరించి వాహనాలు నడపాలన్నారు.. అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా ఆటోలో ఎక్కితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.అంతేకాకుండా ఆటో డ్రైవర్లు పాటించవలసిన జాగ్రత్తలు వారికి కేటాయించిన ప్రదేశంలో మాత్రమే పార్కింగ్ చేయాలని తెలిపారు . రోడ్లమీద ఆటో నిలిపి ప్రయాణికులకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూసుకోవాలని అన్నారు. అదేవిధంగా ఆటో మీద నెంబర్ ప్లేట్ కనబడే విధంగా ఉండాలని ఆటోలో ఎక్కిన ప్రయాణికులతో ముఖ్యంగా మహిళలతో మర్యాదగా ప్రవర్తించాలని వారికి నమ్మకం కలిగేలా వ్యవహరించాలన్నారు. రూల్స్ అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు ఆటో డ్రైవర్లు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.